www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 30 అక్టోబర్ 2025



ఉత్కంఠకు తెర..

నేడు మేయర్ జంట హత్య కేసులో తుది తీర్పు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

2015 నవంబర్ 17న తేదీ నాటి నగర మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌ల జంట హత్యకేసు ఈనెల 16వ తేదీ విచారణ పూర్తి అయ్యింది. ఏ1 నుండి ఏ 5 వరకు హత్య కేసులో ప్రత్యక్షంగా ప్రమేయం ఉన్నట్లు తొమ్మిదో అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు తీర్పు ఇచ్చారు. జంట హత్యకేసులో ప్రమేయం ఉన్న నిందితులకు శిక్ష ఖరారు చేస్తారని భావించినా నిందితులకు శిక్ష ఖరారు అక్టోబర్ 27వ తేదీకి మార్పు చేశారు. 27వ తేదీ హత్య కేసులో నిందితులుగా గుర్తించిన ఐదుగురు చంద్రశేఖర్ (చింటూ) వెంకటాచలపతి, వెంకటేశ్, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్ విచారించిన తొమ్మిదో అదనపు న్యాయమూర్తి ఈనెల 30వ తేదీ గురువారానికి వాయిదా వేస్తూ రిమాండ్‌కు తరలించారు. ఈ హత్యకేసులో 16 మంది నేరంలో పాత్రలేదని రుజువు కాలేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో పోలీసు యంత్రాంగం చిత్తూరు జిల్లా ప్రధాన కోర్టు, గాంధీ సర్కిల్, గంగనపల్లి ప్రాంతాల్లో పోలీసు భద్రత ఏర్పాటు చేసింది.

తరగతి గదే.. పడక గది..

- మెనూ ప్రకారం ఫుడ్ పెట్టరు
- 105 మంది విద్యార్థులకు 8 టాయిలెట్స్
- నాసిరకం కూరగాయలతో వంటలు
- అధ్వానంగా పారిశుద్ధ్యం



ఒక్కచోటే విద్యార్థినులు, గది తలుపు విరిగిన దృశ్యం

ప్రజాశక్తి- పుంగనూరు

ఎంతమంది పాలకులు మారిన వసతి గృహాల తీరుమాత్రం మారడం లేదని.. ఎందరు గొంతు ఎత్తి సమస్యలు వినిపించినా పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఇదే వసతి గృహాలలో విద్యనభ్యసించే బాలబాలికలకు శాపంగా తయారవుతోంది. విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోయినా అంతంత మాత్రంగా వసతులతోనే నెట్టుకొస్తున్నారు.

105 మంది విద్యార్థులకు 8 టాయిలెట్స్

పుంగనూరు పట్టణంలో గిరిజన బాలికల వసతి గృహం మేలుపట్ల గ్రామ సమీపంలో ఉంది. పట్టణానికి కూతవేటు దూరంగా ఉన్నా వసతులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. సమస్యలపై ఏమి అడిగినా ప్రపోజల్ పంపించడం జరిగిందని మంజూరు అవుతుందని సమాధానం తప్పితే మరొకటి చెప్పరు ఇక్కడ నిర్వాహకురాలు. గిరిజనుల వసతి గృహంలో విద్యార్థినులు 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు 105 విద్యార్థినులు ఉన్నారు. వీరికందరికీ కలిసి నాలుగు స్నానపు గదులు, నాలుగు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. వీరందరూ 8 టాయిలెట్స్‌లోనే ఉపయోగించుకోవాలి. దీంతో వీరి పరిస్థితి దుర్భరంగా ఉంది. అంతేకాకుండా వీరు పడుకునే గదిలోనే తరగతి గదులు కూడా నిర్వహించడం విద్యార్థినులకు మరింత ఇబ్బందులు పడుతున్నారు.

మెనూ ప్రకారం ఫుడ్ పెట్టరు..

మెనూ ప్రకారం విద్యార్థులకు ఏ రోజు ఆహారం అందించడం లేదని ప్రజాశక్తి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిరోజు గోంగూర పప్పు తప్పితే వేరే ఏమి పెట్టడం లేదని చెప్పారు. నాణ్యత లోపించిన నాసిరకం కూరగాయలను కాంట్రాక్టర్ సరఫరా చేస్తున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కోడిగుడ్లు సరఫరా కూడా అతి చిన్నవి సరఫరా చేస్తున్నారు. ప్రతిరోజు తక్కువ ధరకు వరకు వచ్చే కూరగాయలతోనే మాకు వడ్డించడం జరుగుతుందని విద్యార్థినులు చెబుతున్నారు. రవ్వతో ఇడ్లీ తయారు చేస్తున్నారని ఇది తినలేక వదిలేస్తున్నామని పిల్లలు తెలిపారు. నిత్యం వీరికి ప్రధానంగా డార్మెటరీ ఒకటి తరగతి గదులు అత్యవసరంగా కావలసి ఉన్నాయి. మరుగుదొడ్లకు ఆనుకొని తరగతి గదులు ఉండడంతో ఎప్పుడు కిటికీలు మూసి ఉంటారు వాటిని తీస్తే దుర్గంధం వస్తుంది. హాస్టల్ వెనుక వైపు పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దీంతో విద్యార్థులు తరచు అనారోగ్యం భారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారు. పట్నంలో మరికొన్ని వసతి గృహాల్లో టాయిలెట్స్ మెయింటెనెన్స్ లేక దుర్వాసన వస్తుంది. హ్యాండ్ వాష్ చోటు కూడా పారిశుధ్యం లోపించి ఉంది. ఎస్సీ బాలికల వసతి గృహంలోకి అనుమతి లేనిదే ఎవరిని లోనికి రానివ్వమని ఏవైనా ఉంటే మీరు వార్డెన్‌తో మాట్లాడుకోవాలని నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నారు.



మరుగుదొడ్లు

డెయిరీ వ్యర్థాలతో చెరువు కలుషితం

- మృతిచెందిన చెందిన చేపలు
- ఆందోళనలో పసుపత్తూరు పంచాయతీ ప్రజలు
- తక్షణం స్పందించిన ఎమ్మెల్యే అమర్
- చర్యలు తీసుకోవాలని ఆదేశాలు



చెరువు నీరు విషపూరితం కావడంతో చనిపోయిన చేపలు

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం):

గంగవరం మండలం పసుపత్తూరు పంచాయతీ రెవెన్యూ పరిధిలోని ఫాం గెట్ పాల డెయిరీ నుంచి వచ్చే వ్యర్థాల కారణంగా చుట్టుపక్కల చెరువులు కలుషితమై చేపలు చనిపోతున్నాయి. ఫాంగెట్ పాల డెయిరీ నుంచి వచ్చే వ్యర్థాలు మండలంలోని గొర్రెలదొడ్డి, కొరపల్లి, నాయనచెరువు దిగువ గొర్రెలగొట్టి గ్రామాల్లోని వనపకుంట, తూముకుంట, కమ్మవాళ్ళకుంట చెరవుల్లో కలిసి నీరు కలుషితమవుతున్నాయి. దీంతో చెరువులు చనిపోవడంతోపాటు ఆ నీటిని తాగుతున్న పశువులు సైతం రోగాల భారిన పడుతున్నారు. వీటి ప్రభావం భూగర్భ జలాలపైనా లేకపోలేదు. అంతేకాకుండా చెరువులు కలుషితం కావడం వలన ఒక్కోసారి భరించలేని దుర్వాసన వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. పశువులను కూడా ఈ ప్రాంతంలో మేపడానికి వీలులేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం పసుపత్తూరు పంచాయతీకి చేరుకుని అధికారులను పిలిపించి వెంటే డెయిరీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అలాగే డెయిరీ వ్యర్థాలను చెరువుల్లో కలుపకుండా చర్యలు తీసుకోవాలని, విషపూరిత నీరు చెరువులోకి వదలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సమస్యపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

తాగునీరివ్వండి మహాప్రభో..



ఖాళీ బిందెలతో మహిళలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : తాగునీరివ్వండి.. మహాప్రభో... అంటూ మండలంలోని మాంగాడు గ్రామం భజనగుడి వీధిలోని ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. పది రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో మహిళలు ఆగ్రహానికి లోనయ్యారు. బుధవారం తాగునీటి కొళాయి వద్ద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. పదిరోజుల పాటు నీరు రాకుంటే తాము ఏ నీటిని వాడుకోవాలని ప్రశ్నించారు. వంట చేయడానికి నీరులేక క్యాన్‌లలో నీటిని కొనుగోలు చేసి వాడుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించి తాగునీటి సరఫరా చేయాలన్నారు. మున్సిపల్ పరిధి రామానాయుడు కాలనీలోను తాగునీరు 4 నెలలుగా సరఫరా కావడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా ప్రాంతానికి సమీపంగానే తాగునీటి ట్యాంకు ఉన్నా తమకు సరఫరా కావడం లేదన్నారు. స్థానికంగా ఉన్న టీడీపీ నేతలకు చెప్పినా సమస్యను వారు పెడచెవిన పెడుతున్నారని అన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసనకు దిగడం తప్ప వేరే మార్గం లేదన్నారు.

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలి

సమన్వయ కమిటీ సమావేశంలో సిఐటియు యూనియన్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- కుప్పం

కుప్పం ప్రాజెక్టులో ఉన్న అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కోసం బుధవారం కుప్పం ఐసిడిఎస్ కార్యాలయంలో అధికారులు, యూనియన్ నాయకులు సమక్షంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ అంగన్వాడీలు పోరాటం చేసి సమస్యలు పరిష్కారం కోసం సమన్వయ కమిటీ రాష్ట్ర స్థాయి నుంచి ప్రాజెక్టు స్థాయి వరకు జరపాలని సాధించడం జరిగిందన్నారు. ఆ సమావేశాలు రెగ్యులర్‌గా జరగకపోవడం వలన సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, పోరాటం చేసిన సందర్భంగా రాష్ట్రం నుంచి కిందిస్థాయి వరకు సమన్వయకమిటీ సమావేశం జరపడానికి అధికార యంత్రాంగం సంసిద్ధమైందని తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లాస్థాయిలో ప్రాజెక్టు సమన్వయ కమిటీ సమావేశం జరిగిన తర్వాత ఎన్ని స్థాయిలో కూడా జరగడం అభినందనీయమన్నారు. కుప్పం ప్రాజెక్టులో రకరకాల సమస్యలున్నాయి. వాటిని పరిష్కారం చేసేదిగా సిడిపిఓ చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత మాట్లాడుతూ ప్రాజెక్టుగా సూపర్వైజర్లు మాటతీరు మార్చుకోవాలని, కొంతమందిని తప్పు చేస్తున్న ప్రోత్సహిస్తున్నారని మానుకోవాలని, వర్కర్లకు హెల్పర్లకి బకాయి ఉన్న వేతనాలు ఇవ్వాలన్నారు. వర్కర్ రిటైర్మెంట్ అయినప్పుడు అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ ఇవాలని ఇప్పటికే కుప్పం ప్రాజెక్టులో కొంతమందికి అన్యాయం జరిగిందని తెలిపారు. అధికారులు వర్కర్లు సమన్వయంతో ఉంటేనే పని జరుగుతుందని తెలిపారు. అదనపు పనులు తగ్గించి సెంటర్ పరిధిలోనే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలు అయినా తర్వాత సిడిపిఓ స్పందిస్తూ నా పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కారం చేయడానికి కృషి చేస్తానని మిగిలినవి జిల్లాకు రాష్ట్ర పరిధిలో పంపుతానని తెలిపారు. సమావేశంలో ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు ప్రమీల, సరళ, సెక్టార్ నాయకులు కస్తూరి, అనిత, భారతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

తిరుపతిలోకి 'నగరి'..?

- గూడూరు నెల్లూరుకేనా..!
- పుంగనూరు మదనపల్లికే..!
- త్వరలోనే అధికారిక ప్రకటన
- ఫలించిన ప్రజల అభ్యర్థన...

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వైసీపీ ప్రభుత్వం చేసిన అశాస్త్రీయ జిల్లాల విభజన సమస్యను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం మార్పులు చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు.. జిల్లాల పునర్విభజనపై రెండు రోజుల పాటు మంత్రివర్గంలో కసరత్తు నడిచింది. ఏడుగురితో కూడిన మంత్రి వర్గ ఉప సంఘం రెవిన్యూ డివిజన్‌లో మార్పులు, కొత్త రెవిన్యూ డివిజన్లు, కొత్త జిల్లాల ప్రతిపాదనలను ప్రజల వద్ద నుంచి స్వీకరించి క్యాబినెట్ ముందు ఉంచారు.. మంగళవారం మంత్రివర్గ ఉప సంఘం ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సుదీర్ఘంగా చర్చించారు.. మార్కాపురం మదనపల్లి లను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలుస్తోంది.. చిత్తూరులో ఉన్న పుంగనూరు నియోజకవర్గం కొత్తగా ఏర్పడే మదనపల్లి జిల్లాలో కలవనుంది.. చిత్తూరు జిల్లాలో కలిసి ఉన్న నగిరి నియోజకవర్గం తిరుపతికి సమీపంలో ఉన్న తిరుపతి జిల్లాలో కలపాలని వైసీపీ మాజీ మంత్రి ఆర్కే రోజా, ప్రస్తుత నగరి టిడిపి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తీవ్రంగా ప్రయత్నించారు.. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఎక్కువ శాతం మంది తిరుపతిలో కలపాలని మంత్రివర్గ ఉప సంఘానికి విన్నవించినట్లు తెలుస్తోంది.. ఇప్పటికే నగిరి నియోజకవర్గం లోని వడమాలపేట, పుత్తూరు మండలాలు తిరుపతిలో కలిసున్నాయి.. ప్రస్తుతం మంత్రివర్గం ఉప సంఘం సిఫార్సుల మేరకు నగరి రెవెన్యూ డివిజన్లో గంగాధర్ నెల్లూరు నియోజకవర్గానికి చెందిన మండలాలు కూడా తిరుపతి జిల్లాలో కలిసే అవకాశం ఉంది. నగిరి నియోజకవర్గంలోని నగిరి, విజయపురం, నిండ్ర మండలాలు తిరుపతి జిల్లాల్లో కలవబోతున్నాయి.. అలాగే జీడి నెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం, వెదురుకుప్పం, పాలసముద్రం, ఎస్ఆర్ పురం మండలాలు తిరుపతి జిల్లాలో కలిసే అవకాశం ఎక్కువగా కనిపిస్తున్నాయి.. విభజన తర్వాత నెల్లూరు జిల్లాలో నుంచి తిరుపతి జిల్లాలో కలిసిన గూడూరు నియోజకవర్గం మళ్లీ తిరిగి నెల్లూరు జిల్లాలోకి వెళ్లనుంది. గూడూరు, కోట, వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు మండలాలు గూడూరు నియోజకవర్గంలో కలిసి ఉన్నాయి.. పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలు మదనపల్లి జిల్లాలో కలవనున్నాయి. నగిరి, జీడి నెల్లూరు, పుంగనూరు నియోజకవర్గంలోని 13 మండలాలు చిత్తూరు జిల్లాలో నుంచి తిరుపతి, మదనపల్లి జిల్లాలో కలవనున్నాయి.. ఇదేగాని జరిగితే రాష్ట్రంలోనే అతి చిన్న జిల్లా 18 మండలాలతో చిత్తూరు జిల్లాగా ఉండనుంది. తిరుపతి జిల్లా విస్తీర్ణం రాష్ట్రంలోనే పెద్దదిగా అవతరించనుంది.

రెడ్ క్రాస్ రక్త కేంద్రం లైసెన్స్ మంజూరు : కలెక్టర్



రెడ్ క్రాస్ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లా కలెక్టరు, రెడ్‌క్రాస్ అధ్యక్షులు సుమిత్ కుమార్ బుధవారం పిజిసిఐఎల్ సౌజన్యంతో పలమనేరు రోడ్డులో నిర్మించిన రెడ్ క్రాస్ రక్త కేంద్రం నూతన భవనాన్ని సందర్శించారు. రెడ్‌క్రాస్ రక్తకేంద్రం లైసెన్స్ మంజూరు, రక్త కేంద్రం మార్పిడి, సభ్యత్వ నమోదు, రక్తదాన శిబిరాల ఏర్పాటుకు సహకార అందిస్తానని తెలిపారు. రెడ్ క్రాస్ రక్త కేంద్ర లైసెన్సు మంజూరు ప్రక్రియ త్వరగా పూర్తిచేసి నూతన భవనాన్ని ప్రారంభించి ప్రజల అవసరార్థం సేవలు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ద్వారా రక్త కేంద్రానికి క్యాంపు వెహికల్, లక్ష్మీ నగర కాలనీలో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌కు సిఎస్ఆర్ నిధులు సమకూర్చడం, రక్తకేంద్ర భవనం మొదటి అంతస్తులో అసంపూర్ణంగా ఉన్న పనిని సొంత నిధులతో పూర్తి చేయుటకు రెడ్‌క్రాస్ కోశాధికారి డాక్టర్ ఎం.తేజమూర్తి హామీ ఇవ్వడం జరిగింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ ఏండి శైలజ కిరణ్ రెండవ అంతస్తు నిర్మాణం చేపట్టడానికి మొదటి విడతగా రూ.20 లక్షలు మంజూరు చేయడం జరిగింది. రెడ్ క్రాస్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయించాలని పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు నిమిత్తం జిల్లా అధికారులు, మండల అధికారుల సహకారంతో సభ్యత్వ నమోదు ఎక్కువ మొత్తంలో చేసి రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలు విస్తృత పరచాలని ఆదేశాలు ఇచ్చారు. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ వి.రమేష్ బాబు, వైస్‌ఛైర్మన్ కె.గోవర్ధన బాబి, కోశాధికారి డాక్టర్ ఎం.తేజోమూర్తి, రక్తకేంద్ర వైద్యాధికారులు డాక్టర్ జయశంకర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, రెడ్ క్రాస్ పరిపాలన అధికారి వి.గోపి జిల్లా కోఆర్డినేటర్ చిరంజీవి పాల్గొన్నారు.

కుప్పం నుంచి ది గ్రేట్ ఆంధ్ర రైడ్



ప్రజాశక్తి- కుప్పం: కుప్పం ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు చేపట్టిన ది గ్రేట్ ఆంధ్ర రైడ్‌ను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం ప్రారంభించారు. కుప్పం గంగమ్మ ఆలయం వద్ద పూజా కార్యక్రమంలో నిర్వహించి రైడ్ ప్రారంభించారు. సీఎం చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వివరించేందుకు కుప్పంకు చెందిన ముగ్గురు రైడర్లు సంకల్పించడం ఎంతో శుభ పరిణామమని ఎమ్మెల్సీ శ్రీకాంత్ అభినందించారు. యువత ఇలాంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని, ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం నుండి ముగ్గురు యువకులు రాష్ట్రవ్యాప్త పర్యటనకు పూనుకోవడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో ఉడ ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ అడ్వైసర్ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, మండల అధ్యక్షులు ఉదయ్ కుమార్, సుబ్బు పాల్గొన్నారు.

ఉపాధి జాబ్ కార్డులున్న వారందరికీ

ఈ కేవైసీ తప్పనిసరి: డ్వామా పీడీ

ప్రజాశక్తి- యాదమరి: ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఈ కేవైసీ తప్పనిసరిగా చేయాలని చిత్తూరు జిల్లా ఉపాధి హామీ చట్టం సంచాలకులు రవికుమార్ తెలిపారు. బుధవారం డ్వామా కార్యాలయ సమావేశ మందిరంలో చిత్తూరు, యాదమరి మండలాల సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్స్ టెక్నికల్ అసిస్టెంట్స్ జేఈలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో పనులు చేసే ఉపాధి శ్రామికులకు వారికే నేరుగా కూలీ డబ్బులు సకాలంలో చెల్లించేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఈ కేవైసీ చేయాలని లక్ష్యం నిర్దేశించడం జరిగిందని, అయితే కొన్ని మండలాల్లో ఈ కేవైసీ చేయడంలో చాలా వెనుకబడి ఉన్నారన్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఈ కేవైసీ వంద శాతం పూర్తి కాలేదని, ఈ వారంలోపు పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. యాదమరి, చిత్తూరు మండలాల్లో ఉపాధి కూలీల పని దినాలు సంఖ్య చాలా తక్కువగా ఉందని ఇది పెంచేలా క్షేత్రస్థాయిలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు మండలంలో విస్తారంగా కురుస్తుండడంతో వ్యవసాయ రైతులకు కావలసిన పనులను గుర్తించి వారి వద్ద పనులు చేపించే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో నూతనంగా మంజూరైన గోకులం షెడ్ల పనులు వెంటనే ప్రారంభించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల వద్ద ఏర్పాటు చేసే ఇంకుడు గుంతలు చేపించడంలో చాలా వెనుకబడి ఉన్నారని వాటిని వెంటనే ప్రారంభించి పూర్తి చేసే విధంగా టీఏలు, జేఏలు వాటిపై పర్యవేక్షణ చేపట్టాలన్నారు. రైతులకు కంపోస్ట్ ఫీట్ పనులు చేపించడంలో రెండు మండలాలు వెనుకబడి ఉన్నాయని ఆ పనులను కూడా వెంటనే పనులు ప్రారంభించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. చిత్తూరు యాదమరి మండలాల ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీ, జేఈలు పాల్గొన్నారు.

కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ కార్యాలయాలు



వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్

ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిర్వర్తించడానికి అనువైన కార్యస్థానం అవసరమని, జిల్లా సచివాలయం నుండి వర్చువల్ విధానంలో సమీక్షలు నిర్వహించడానికి, పరిస్థితులను పరిశీలించడానికి అనువుగా ప్రస్తుతం ఉన్న వీడియో కాన్ఫరెన్స్ హాల్, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పునరుద్ధరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలో పునరుద్ధరించిన వీడియో కాన్ఫరెన్స్ హాల్, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను డిఆర్ఓ కె.మోహన్ కుమార్, ఆర్డిఓ, శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏఓ వాసుదేవన్‌లతో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సచివాలయంలో ఉద్యోగుల తమ విధులు నిర్వర్తించడానికి అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడంలో భాగంగా గతంలో ఉన్న వీడియో కాన్ఫరెన్స్‌ను జేసి జి.విద్యాధరి, డిఆర్ఓల ఆధ్వర్యంలో పునరుద్ధరించి వీడియో కాన్ఫరెన్స్ హాల్, కమాండ్ కంట్రోల్ రూమ్‌గా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు కార్పొరేట్ తరహాలో పరిశుభ్రత, పచ్చదనం పెంపు, మౌలిక వసతుల కల్పన, రికార్డుల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రికార్డులు సమర్థవంతంగా నిర్వహిస్తే సమస్యల పరిష్కారం సులభం అవుతుందన్నారు. నూతన వీడియో కాన్ఫరెన్స్ హాల్, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను అవసరమైన అన్ని ప్రభుత్వశాఖలు వినియోగించుకోవచ్చునని అన్నారు. డిఆర్ఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ సమర్థవంతమైన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేయడం అధికారులు, సిబ్బంది అదృష్టమని, తాను డిఆర్ఓగా జిల్లా ఉద్యోగ భాద్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తవుతున్నదని తెలిపారు. ప్రభుత్వ అధికారులు తమ అధికారిక కార్యకలాపాల నిర్వహణకు అనువుగా వీడియో కాన్ఫరెన్స్ హాల్, కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి గతంలో జిల్లాకు విశిష్ట సేవలందించిన ఎం.నాగార్జునపేరుతో జిల్లా కలెక్టర్ నామకరణం చేశారన్నారు. జిల్లా కలెక్టర్ జిల్లాకు వచ్చిన అనంతరం తీసుకున్న నిర్ణయాల ద్వారా మార్పు మొదలైందని, త్వరలో జిల్లా అభివద్ధి పథంలో పాయనిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. హాస్పిటల్స్, పాఠశాలల అభివద్ధికి నిధులు మంజూరు చేశారని, 17 తహశీల్దార్ కార్యాలయాలలో అవసరమైన ఎంఆర్ఓ ఛాంబర్లు, మీటింగ్ హాల్‌లు, ప్రజలు వేచి ఉండే గదులు, మరుగుదొడ్ల మరమ్మతులకు సహకరిస్తున్నారన్నారు.

నీరు నిలవకుండా వేగంగా చర్యలు

కమిషనర్ నరసింహ ప్రసాద్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో నిల్వ నీటిని వీలైనంత వేగంగా తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిషనర్, నగరపాలక అధికారులతో కలిసి సంతపేట, వీరభద్ర కాలనీ, దోభి ఘాట్, తోటపాళ్యం తదితర లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాల ప్రభావం తగ్గడంతో వీధులు, ఇళ్ల మధ్య ఉన్న నీటిని తిలగించేందుకు వేగంగా చర్యలు చేపట్టాలన్నారు. సంతపేటలో కాలువలను పరిశీలించారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్నచోట కాలువలను వెడల్పు చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని, దోమలు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సరఫరా పైప్‌లైన్లను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని, లీకేజీ లేకుండా అరికట్టాలన్నారు. నీటి సరఫరా ట్యాంకులు, సంపులో క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు, వార్డు కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆగని ఏనుగుల దాడులు

భయం గుప్పెట్లో రైతులు

ప్రజాశక్తి - రొంపిచెర్ల: పులిచెర్ల మండలంలో నిత్యం వ్యవసాయ పంటలపై ఏనుగులు దాడులు కొనసాగుతూనే వున్నాయి. రైతులకు ఈ ఏనుగుల గుంపు దాడుల వల్ల కన్నీటి బాధ తప్పడం లేదు. ఈ క్రమంలో బుధవా రం తెల్లవారు జామున రిజర్వు అటవీ ప్రాంతం నుంచి బయలు దేరిన 16 ఏనుగుల గుంపు పేట పంచాయతీలో వరి, మామిడి, కొబ్బరి చెట్లు, పశుగ్రాసం, టమోటా పంటలను తొక్కి విధ్వంసం సృష్టించాయి. ఈ ఏనుగుల దాడిలో రైతులు సుధాకర్, బసవయ్య, రెడ్డప్ప రెడ్డి, భాస్కర, గిరి, సిద్ధయ్యలకు చెందిన పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేసి రైతులకు నష్టం కలిగిస్తు న్నాయి. ఈ ఏనుగుల గుంపు మండలం లో ప్రతిరోజు ఏదో ఒకచోట రైతులను నష్టపరుస్తూనే ఉన్నాయి. అర్ధరాత్రి దాటాక అడవులలో నుంచి రావడం, పంటలను తొక్కి నాశనం చేసి తిరిగి అడవుల్లోకి వెళ్లడం పరిపాటిగా మారింది. అధికారులు ఈ సమస్యకు పూర్తి పరిష్కారం చూపలేక పోతున్నారు.


ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

రాజకీయ వేధింపులు తగదు

- బాధిత వికలాంగులకు జేఏసీ అండ
- పోలీసులకు ఏపీ వికలాంగుల సంఘాల జేఏసీ నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి-ఐరాల: వికలాంగుల పింఛను దారులపై రాజకీయ వేధింపులు తగదని ఏపీ వికలాంగుల సంఘాల ఐక్య కార్యాచరణ సమితి జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల పింఛన్ దారులపై వేధింపులను నిరసిస్తూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కొణతం చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు సుమతి, లీలావతి నాయుడు తదితరులు బాధిత వికలాంగులతో కలిసి ఐరాల ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కొణతం చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు మురళి మాట్లాడుతూ మండలంలోని ఐరాల పంచాయతీ, గోవింద రెడ్డి పల్లి గ్రామానికి చెందిన వరదరాజులు రెడ్డి, గోవిందమ్మ, చిన్నరాజుల రెడ్డి, నాగరత్నమ్మ, తులసమ్మ, చిట్టి బాబు అనే వికలాంగుల పింఛన్ల దారులపై అదే గ్రామానికి చెందిన ఎ వి రంజిత్ తన రాజకీయ ఆధిపత్యం కోసం తన అనుచరులతో కలిసి ప్రభుత్వ అధికారులకు తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదు చేసి పలుమార్లు విచారణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని బాధిత వికలాంగులు తెలిపారని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. వారు గతంలోనే సదరం రీ వెరిఫికేషన్ చేయించుకుని కొత్త సదరం సర్టిఫికెట్‌ను కూడా పొందరని తెలిపారు. అయినా వీరి పింఛన్లు తొలగించడమే లక్ష్యంగా చేసుకుని తప్పుడు ఫిర్యాదులతో వేధింపులకు గురి చేయడం సబబు కాదన్నారు. అనంతరం ఐరాల పోలీస్‌స్టేషన్‌లో ఎవి రంజిత్, అతని అనుచరులపై పోలీసులకు జేఏసీ నేతలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. విచారణ పేరుతో వేధిస్తున్న ప్రభుత్వ అధికారులపై ఏపీ లోకాయుక్తకు ఫిర్యాదు చేయనున్నట్లు జేఏసీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు ఏకాంబరం, ప్రసాద్, కవిత, భాగ్యలక్ష్మీ, గోవింద గౌడ్, నారాయణరెడ్డి, భూపతి, బాధిత వికలాంగులు పాల్గొన్నారు.


జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న వికలాంగుల పింఛను దారులు

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు

రెస్కో అధికారుల స్పందన


మరమ్మతులు చేస్తున్న రెస్కో సిబ్బంది

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలం కనుమనపల్లి గ్రామ పంచాయతీ, కనమన పల్లిలో ఐదు రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు నోచుకోక పోవడంతో స్థానిక బిసి కాలనీ వాసులకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీనిపై రెండు రోజుల క్రితం 'ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు మరిచారు..' అనే శీర్షికన 'ప్రజాశక్తి'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన రెస్కో బృందం బుధవారం వెంటనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. తమకు తాగునీరు అందడంతో బీసీ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెస్కో సిబ్బంది, సర్పంచ్, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంపిణీ బాధ్యత డీలర్లదే

నిత్యావసర సరుకుల డీలర్లకు తహశీల్దారు ఆదేశం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రజలకు నిత్యావసర సరుకులు క్రమం తప్ప పంపిణీ చేసే బాధ్యత డీలర్లదే అని తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండల తహశీల్దారు కార్యాలయంలో నిత్యావసర సరుకుల పంపిణీ డీలర్లతో తహశీల్దారు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 56 ఎఫ్‌పి షాపులు ఉన్నాయని వీటి ద్వారా రేషన్ కార్డుదారులకు రేషన్ బియ్యం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం రాయితీ సరుకులు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు కళ్యాణి, డీలర్ల సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, డీలర్లు రఘు, కృష్ణయ్య, రాధాకృష్ణ, వాసుదేవ నాయుడు, నాగేశ్వర్ నాయుడు, శంకర్‌రెడ్డి పలువురు డీలర్లు పాల్గొన్నారు.


డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న తహశీల్దారు

అనాథకు అంత్యక్రియలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: సిఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, ముస్లిం జేఏసీ సభ్యులు అనాథ మృత దేహానికి బుధవారం అంత్య క్రియలు నిర్వహించారు. తగ్గువారిపల్లి శ్మశాన వాటికలో హిందూ సంప్రదాయపద్ధతిలో దహహన సంస్కారాలు నిర్వహిం చారు. నాలుగు రోజులుగా అనారోగ్యంతో ప్రభుత్వ ఆస్పత్రిలో నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరూ రాకపోవడంతో అంత్యక్రియలు చేపట్టామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాబు, ముస్లిం జేఏసీ సభ్యులు ఫిరోజ్ అహ్మద్, రఫీ, సమీర్, రాజా, పారిశుధ్య కార్మికులు బాలాజీ, షణ్ముగం పాల్గొన్నారు.


అనాథకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి- శాంతిపురం: గ్రామాలలో పరిశుభ్రతపై ప్రతి ఇంటికీ అవగాహన కల్పించి, తడి, పొడి చెత్తను ప్రతి రోజు ఎలక్ట్రికల్ ఆటోల కు అందించాలని ఎంపిడివో తెలిపారు.



ఎంపిడివో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపిడివో కుమార్ మాట్లాడుతూ శాంతీపురం మండలంలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్ది, స్వచ్ఛ సాధనే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మండలంలో 23 ఎలక్ట్రికల్ ఆటోలు, 10 ట్రైసైకిళ్ళు, 59 మంది క్లాప్ మిత్రాలు ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేసి, ఆ చెత్తను ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లకు తరలించి సేంద్రియ ఎరువులుగా తయారు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపిడివో తెలిపారు. ఇకపై (క్లస్టర్ రిసోర్స్ పర్సన్)లు ప్రతి గ్రామం లో పర్యటించి, బాధ్యతగా పనిచేసే, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు, అవగాహన కల్పించి అంటువ్యాధులు ప్రబలకుండా చేసి పరిసరాలు పరిశుభ్రంగా వుంచి, స్వచ్ఛ శాంతిపురం సాధనకు కృషి చేయాలని ఎంపిడివో తెలిపారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరన్, డిఆర్‌పి ఆంజనేయులు, వాసు పాల్గొనారు.

వైసిపిని నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలం కంచబంధార్లపల్లి గ్రామ పంచాయతీ, కంచ బంధార్లపల్లి గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో టిడిపి కండువాలు వేసుకొని బుధవారం ఆ పార్టీలో చేరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అభివృద్ధికి ఆకర్షితులై ఆ పార్టీని వీడి టిడిపిలో చేరారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, గుడిపల్లి మండల పార్టీ అధ్యక్షులు సుబ్రమణి, రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ బాబు నాయుడు, హేమాంబార్ గౌడు, బాలాజీ, వెంకీ ,రాఘవ పాల్గొన్నారు.


టిడిపిలో చేరిన వైసిపి నాయకులు, కార్యకర్తలు

ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలి

- స్వచ్ఛమైన తాగునీరు అందించాలి
- ఎంపీడీవో జీవీఎస్‌వి ప్రసాద్

ప్రజాశక్తి -సోమల: మండలంలోని పంచాయతీ వారు ఓవర్ హెడ్ ట్యాంకులను జిఎల్ఎస్ఆర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి పరిశుభ్రంగా కడిగి తర్వాత ట్యాంకులను నీటితో నింపి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఎంపీడీవో జీవీఎస్ వి ప్రసాద్ కోరారు. ఇరికిపెంట పంచాయతీలో పలు నీటి సరఫరా ట్యాంకులను బుధవారం ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. అంతకుముందు సచివాలయంలో ఆధార్ బయో మెట్రిక్ కేంద్రాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు అందరికీ తప్పనిసరిగా బయోమెట్రిక్ చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి బీసీ మండల కమిటీ ఎంపిక


వేలు మొదలి చిట్టిబాబు మొదలి కుప్పుస్వామి మొదలి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల వైసిపి బీసీ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి బుధవారం తెలిపారు. మండల వైసిపి కార్యవర్గ అధ్యక్షుడు వేలుమొదలి, తూగుంద్రం గ్రామానికి చెందిన బిసి కార్యవర్గ ఉపాధ్యక్షుడిగా చిట్టిబాబు మొదలి, సెక్రటరీ కుప్పస్వామిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ వైసిపి అభివృద్ధికి మరింత ఉత్సాహంతో పని చేస్తామని తెలిపారు. ఈ పదవి ఇచ్చినందుకు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



ద్రావిడ విశ్వవిద్యాలయంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ద్రావిడ విశ్వవిద్యాలయంలో అవగాహన

ప్రజాశక్తి-గుడిపల్లి: 'లంచం తీసుకొని పనిచేయడం నేరం' అనే అంశంపై ద్రావిడ విశ్వవిద్యాలయంలో జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. విజిలెన్స్ భారతదేశాభివృద్ధిలో భాగంగా, ఐక్యత ప్రాథమికంగా లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని ఈ సందర్భంగా వివరించారు. లంచం తీసుకొని పనిచేయడం నేరమని, అవినీతి రహిత దేశం కావాలన్నారు. ఏదైనా ఆశించి పనిచేసేవారి వల్ల అభివృద్ధి కుంటు పడుతుందని, లంచం తీసుకొని పని చేయడంలో వున్న నష్టాలను విద్యార్థులకు కోఆర్డినేటర్, ఇన్‌చార్జ్ ఇ హర్షవర్ధన్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఇ హర్షవర్ధన్, డాక్టరు టి వెంకటస్వామి, డాక్టరు ఎస్ హేమలత, డాక్టరు వి సరస్వతి, డాక్టరు మారియప్పన్, డాక్టరు జి శైలమ్మ పాల్గొన్నారు.

ఇళ్లలోకి వర్షం

- టిడిపి నాయకుల దాతృత్వం
- బియ్యం, కూరగాయలు పంపిణీ

ప్రజాశక్తి -కార్వేటినగరం : మూడు రోజులుగా కురిసిన వర్షానికి కోటర్వేడు దళిత వాడలో పూరి గుడిసెలో నీళ్ల రావడంతో స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పదించన ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశాలతో ఎమ్మెల్యే సోదరులు రాజా బాధిత కుటుంబాలకు బియ్యం, కూర గాయలు ఎమ్మెల్యే సాయంతో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఎమ్మెల్యే థామస్ ప్రజలకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఆ ఇళ్లల్లో నీళ్లు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. మోటార్ ద్వారా నీళ్లను బయటకు పంపుతామని, సర్వే చేపట్టి డ్రైనేజీ ఏర్పాటుకు కృషి చేస్తామని కార్యదర్శి కనకరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మోహన్ నాయుడు, చంద్రమోహన్, పొద్దుటూరు రాజా, ఆనగల్లు సుమన్ , గంగాధరం బాలాజీ పాల్గొన్నారు.


బియ్యం, కూరగాయలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు


సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు రాజా, నాయకులు

కల్వర్టు నిర్మించి ప్రమాదాలు అరికట్టాలి

ప్రజాశక్తి -కార్వేటినగరం : మండల పరిధిలోని కోటర్వేడు నుంచి కనికాపురం వెళ్లే దారిలో తారు రోడ్డు పల్లంగా ఉండడంతో అక్కడ నీళ్లు నిలిచిపోవ డంతో ప్రయాణికులకు, ద్విచక్ర వాహనదారులకు వర్షం పడితే వెళ్లేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని మాజీ ఎంపీటీసీ, టిడిపి నాయ కులు, గంగాధరం ఎమ్మెల్యే సోదరులు వి రాజాకు వివరిం చారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కనికాపురం గ్రామంలో 14 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని వర్షానికి నీళ్లు రావడంతో వారు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజా దృష్టికి టిడిపి నాయకులు చంద్రమోహన్ తీసుకొచ్చారు. బుధవారం స్వయంగా పరిశీలించి రాజా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసు కెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మోహన్ నాయుడు, బాలాజీ, పొద్దుటూరు రాజా, సుమన్ పాల్గొన్నారు.



పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఎస్ నడింపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ విజయకుమారి తనిఖీ చేసి, రికార్డులను , విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అసెస్మెంట్ బుక్లెట్లను చూసి విద్యార్థుల మార్కులను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

రహదారి రొచ్చురొచ్చు!

- భారీ గుంతలు
- వాహన చోదకులు, పాదచారులకు ఇక్కట్లు
- దుస్థితిలో సచివాలయ రోడ్డు

ప్రజాశక్తి -బంగారుపాలెం: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఆ రహదారి రొచ్చురొచ్చుగా మారింది. కంకర తేలి భారీ గుంతలు ఏర్పడటంతో వాహన చోదకులు, పాద చారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు పట్టించు కోకపోవడంతో రహదారి దుస్థితికి చేరుకుంది.

రహదారి రొచ్చురొచ్చు!

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని తగువారిపల్లి పంచాయతీ గ్రామ సచివాలయానికి వెళ్లే రహదారి వర్షపు నీటితో రొచ్చు రొచ్చుగా మారింది. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు గుంతల్లో చేరి ఇబ్బందికరంగా మారింది.

వాహన చోదకులు, పాదచారులకు ఇక్కట్లు

ఈ దారిలో వెళ్లాలంటే వాహన చోదకులు, పాదచారులు పడరాని పాట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. సచివాలయానికి, పద్మావతి నగర్ సాయి నగర్‌కు వెళ్లేవారు ఈ దారి మీదుగానే వెళ్లాల్సి వుంది. దీనివల్ల వాహన దారులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రహదారికి మరమ్మతులు చేసి తమకు ఇక్కట్లు లేకుండా చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.


గుంతలతో రొచ్చురొచ్చుగా మారిన సచివాలయం రహదారి

గోకులం షెడ్లు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి -శాంతిపురం: శాంతీపురం మండలంలో మొదటి విడత , రెండో విడతలలో మంజూరై నిర్మాణం చేపట్టిన గోకులం షెడ్లను అబకలదొడ్డి గ్రామ పంచాయతీ పరిధిలోని కెజెపల్లెలో పరిశీలించారు. కొంత మంది రైతులు ఇంకా బిల్లులు అందలేదని, వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎంపిడివో స్పందిస్తూ పూర్తయిన వాటికి, వివిధ దశలో పనులు చేస్తున్న వాటికి బిల్లులు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎంపిడివో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడివో ఎపిజె కుమార్ మాట్లాడుతూ మండలంలో మొదటి విడత, రెండో విడతలలో మొత్తం 255 గోకులం షెడ్లు మంజూరు అయ్యాయని, వీటి విలువ సుమారు రూ.5.86 లక్షలు ఉంటుందని, వీటిలో ఇప్పటివరకు 126 గోకులం షెడ్లు పూర్తి అయ్యాయని 66 గోకులం షెడ్లు వివిధ దశలో పనులు జరుగుతున్నాయని, ఇక మిగిలిన 63 గోకులం షెడ్లు ఇంకా పనులు ప్రారంభించ లేదన్నారు. ఈ గోకులం షెడ్లల నిర్మాణ పనులు ప్రారంభించని వారు వెంటనే ఒక నెల లోపు పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని సార్థకం చేసుకోవాలని ఎంపిడివో తెలిపారు. నెల లోపు గోకులం షెడ్ల నిర్మాణం పనులు ప్రారంభించకపోతే మంజూరైన గోకులం షెడ్లను రద్దు చేస్తామని ఎంపిడివో తెలిపారు. ఈ పరిశీలనలో టిఎ ధర్మలింగం, ఎఫ్ఎ సుబ్రహ్మణ్యం, స్థానిక ప్రజా ప్రతినిధు లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఆదమరిస్తే అంతే సంగతులు!

- రోడ్డుపై భారీ గుంతలు
- రాకపోకలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-సోమల: సోమల నుండి పుంగనూరు వెళ్లే మార్గ మధ్యంలో ఇరికిపెంట చెన్నపట్నం చెరువు డ్యాం వద్ద రోడ్డుపై భారీ గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వర్షా లు రాక ముందే గుంత లు ఏర్పడగా వర్షాలు పడ్డ తర్వాత గోతు లు మరింత ఏర్పడడంతో ద్విచక్ర, కారు, బస్సు, లారీ వాహ నాలు ఆదమరిచి వేగంగా ప్రయాణిస్తే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం వుంది. ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయక పోవడంతో ప్రధాన రహదారి కావడంతో వాహనాలు వేగంగా వచ్చి గుంతలలో దిగుతుండడంతో ఒక్కోసారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు భవనాల శాఖ వారు వెంటనే స్పందించి గుంతలను పూడ్చడమో, లేక తారు రోడ్డు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన రోడ్డు


ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తున్న వాహన చోదకులు

అంధకారంలో జోగిఇండ్లు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న జోగిఇండ్లల్లో నివసిస్తున్నారు. వారు వ్యవసాయ కూలీలుగా, పాడి ఆవులతో జీవనం సాగిస్తున్నారు. రాత్రిపూట వీధిలైట్లు వెలగక అంధకారంలో తిరగాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు తెలిపినా పట్టించుకున్న పాపాన పోలే దన్నారు. కొద్ది రోజుల క్రితం పాడి రైతుకు చెందిన ఆవు షెడ్డులో ఉన్న సమయంలో పాము కాటుకి బలై మృతి చెందింది. దీంతో రైతు ఉపాధి కోల్పోయాడు. గ్రామంలోని పురవీధులలో వర్షం కారణంగా పిల్లలు, పెద్దలు తిరగాలంటే వెలుతురు లేక రాత్రి సమయంలో చాలా ఇబ్బందికరంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉన్నత అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేసి గ్రామంలో అంధకారం తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కనక నాచమ్మ ఆలయానికి ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి-కుప్పం: ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని కుప్పం మండలం పెద్దవంక సమీపంలోని కనకనాచమ్మ ఆలయం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బుధవారం ప్రారంభించారు. కుప్పం పరిసర ప్రాంతాల నుండి కనక నాచమ్మ దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించినట్లు ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం తెలిపారు. కుప్పం నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు సైతం ఆర్టీసీ సర్వీసులు నడుస్తుందని, త్వరలోనే కుప్పం ఆర్టీసీ డిపో బస్టాండ్‌ను రాష్ట్రానికే ఆదర్శంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మార్కెట్ కమిటీ చైర్మన్ మునిరాజు మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, వెంకటేష్, సతీష్, సుగుణమ్మ, రామచంద్ర, రాష్ట్ర నేత గోపీనాథ్, మాజీ ఏఎంసి చైర్మన్ సత్యేంద్ర శేఖర్, రెస్కో డైరెక్టర్లు ఆర్ముగం మురళి, డాక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

భూకబ్జాకు పెత్తందారుల కుట్ర

బాధితుడు శ్రీనివాసులు ఆవేదన

ప్రజాశక్తి - రొంపిచెర్ల: నా భూమిని కబ్జా చేసేందుకు అగ్రవర్ణాల వారు కుట్ర పన్నుతున్నారని దళితుడు శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడి కథనం మేరకు.. రొంపిచర్ల మండలం చిచిలి వారి పల్లె గ్రామ పంచాయతీ గాజుల పల్లెకు చెందిన గుండ్లూరి కృష్ణయ్య కుమారుడు శ్రీనివాసులు తాత గుండ్లూరి ఎర్రయ్య పేరుతో 1929 ఫిబ్రవరి 17వ తేదీ సర్వే నెంబరు 1146-2 లో 2.35 ఎకరాల డీకేటి భూమికి పట్టా ఇచ్చారు. ఈ భూమి ఇతరులకు పరాధీనం చేయ కూడదనే షరతుతో పట్టా ఇచ్చారని తెలిపారు. అయితే తమ తాత ఎర్రయ్య 50 సంవత్సరాల క్రితం మృతి చెందాడని, దీంతో తమ పెద్దల పేరుతో ఉన్న భూమిని తన పేరుతో బదిలీ చేయించుకున్నానని బాధితుడు పేర్కొన్నారు. ఆ భూమిపై పీలేరు బ్యాంకులో పంట రుణం కూడా తీసుకున్నారని తెలిపారు. అయితే తమ గ్రామానికి చెందిన దాసరి మునిరామయ్య సర్వే నెంబరు 1146లో 59 సెంట్లు, దాసరి వెంకట ముని 1.10 ఎకరాలను, దాసరి చంద్రయ్య 59 సెంట్లు భూమిని 2016 వ సంవత్సరంలో అప్పటి రెవెన్యూ అధికారులు తన భూమిని వారికి ఆన్లైన్ చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేశారని పేర్కొన్నాడు. దీంతో తాను పీలేరు కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ కూడా తీసుకున్నాని తెలిపారు. తన అనుభవంలో ఉన్న భూమిని అగ్రవర్ణాలు వారు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. తాను దళితుడినే కాదని, లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై జిల్లా అధికారులు విచారణ చేసి తనకు న్యాయం చేయాలని దళితుడు శ్రీనివాసులు కోరుతున్నారు.


బాధితుడు



గ్రంథాలయాల అభ్యున్నతికి కృషి..!


రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి

ప్రజాశక్తి- రామకుప్పం: రాష్ట్రంలోని గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని గ్రంథాలయాలు అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ప్రతి మండలంలోనూ గ్రంథాలయాలు ఉండాలని ఆదేశించారన్నారు. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో డిజిటల్ గ్రంథాలయాలుగా ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కుప్పం మండలంలో శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయాన్ని నూతన భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. రాష్ట్ర నేత నారాయణ చారి, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షుడు వెంకటరమణ, ఆనందరెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, ఎంపిపి సులోచన గుర్రప్ప, రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్, సీతాపతి, రామ్మూర్తి, చలపతి, చిన్నకృష్ణ, కృష్ణ నాయక్, గంట్లప్ప గౌడు, వెంకట్రామే గౌడు, వెంకటాచలం, మునిరెడ్డి, మంజునాథ్ రెడ్డి పాల్గొన్నారు.



వార్డుల వారీగా సమస్యలపై సమీక్ష

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలో వార్డుల వారీగా అధికారులు, ప్రజాప్రతినిధుల బృందం ప్రజా సమస్యలపై సమీక్షిస్తోంది. బుధవారం అనిమిగానిపల్లిలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కమిషనర్ శ్రీనివాసరావు, రెస్కో చైర్మన్ ప్రతాప్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్ పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించి భాగస్వాములు కావాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం,కృష్ణమూర్తి, పాల్గొన్నారు.



మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి-పలమనేరు: గంటాఊరు, ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీలలో మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేస్తామని కమిషనర్ రమణా రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని గంటా ఊరు, ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీ వాసులు తమకు మౌలిక వసతులైన రోడ్లు, కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన విషయం పాఠకులకు విదితమే. తాము ఇల్లు నిర్మించుకొని దాదాపు 20 ఏళ్లైనా మౌలిక వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. వర్షాల వల్ల మోకాళ్ల లోతు బురద ఏర్పడి ఆటోలు సైతం రావడం లేదని వాపోయారు. వెంటనే తమకు రోడ్లు వేయాలని కమిషనర్ రమణారెడ్డిని కోరారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి బుధవారం ఉదయం గంట ఊరు బీసీ కాలనీలో పర్యటించి ప్రస్తుతానికి తుపాను సమస్య తీవ్రంగా ఉన్నందువల్ల తాత్కాలికంగా జెసిబి సాయంతో కాలువల పూడికతీత, రోడ్లలో బురదను తొలగించడం, వీధిలైట్లు ఏర్పాటు చేశారు. తర్వాత భవిష్యత్తులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో సంప్రదించి కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు.


కాలనీలను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు: ఎస్ఐ

ప్రజాశక్తి -సోమల: కళాశాలల విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించి పాఠాలు శ్రద్ధగా విని పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలకు చేరాలని, మత్తు పదార్థాలకు విద్యార్థులు ఆకర్షితులై బానిసలుగా మారొద్దని ఎస్ఐ శివశంకర్ కళాశాల విద్యార్థులను కోరారు. బాల్య వివాహాలు నేరమని, అలా ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని, తల్లిదండ్రులు బాలికలకు వివాహాలు చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, మాజీ ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు, అధ్యాపకులు గౌతం, సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు టిడిపి సన్నద్ధం

ప్రజాశక్తి-కుప్పం: త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు టిడిపి సన్నద్ధమవుతోంది. పంచాయతీల వారీగా టిడిపి సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ గ్రామీణ స్థాయిలో పార్టీ క్యాడర్‌ను మరింత బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం కుప్పం మండలం వసనాడులో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు టిడిపి శ్రేణులు కృషి చేయాలని ప్రధానంగా అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ పంచాయతీలను ఆదర్శంగా అభివృద్ధి చేసుకోవాలని రాజగోపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రామచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, కో క్లస్టర్ వేడి, యూనిట్ ఇంచార్జి వల్లెప్ప, రెస్కో డైరెక్టర్ మురళి, మణి, సంతోష్, విభూషణ్, గుణశేఖర్, శివ, రాజా, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు శరవణ, చరణ్, సుబ్బు, శివ, బాబు, కనకరాజు, రియాజ్ పాల్గొన్నారు.

స్వెటర్లు పంపిణీ

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం పట్టణంలో రోడ్డు పక్కన ఉంటున్న వృద్ధులు, వికలాంగులకు కుప్పం సమాచారం సొసైటీ సభ్యుడు హర్షణ్ బుధవారం స్వెటర్లను పంపిణీ చేశారు. కుప్పం ప్రాంతంలో ఇటీవల చలి తీవ్రత అధికంగా ఉండడంతో రోడ్డు పక్కన నివసిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారని వారికి కుప్పం సమాచారం సొసైటీ ఆధ్వర్యంలో స్వెటర్లను పంపిణీ చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మతిన్,కలీం,సురేష్, చంద్ర రాజ్వేల్, లాలు, ప్రవీణ్, ఇస్మాయిల్, గురుస్వామి పాల్గొన్నారు.


వృద్ధులకు స్వెటర్లు పంపిణీ చేస్తున్న దాత

నేడు సన్నిధి మండపం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల లోని శ్రీ పార్వతీ స్వయంబేశ్వర స్వామి వారి నూతన సన్నిధి మండపాన్ని గురువారం శుభ ధనుర్ లగ్న పుష్కరాంశం ప్రకారం ఉదయం 10-59 నిమిషాలకు ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాలకు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం సాయంత్రం ఉత్సవమూర్తుల బ్రహ్మోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తుల విరాళాలతో నిర్మించిన సన్నిధి మండపం ప్రారంభోత్సవం కళ్యాణోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులపై కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రస్తుతం సైబర్ నేరాల పట్ల ప్రతి విద్యార్థి పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా డీఎస్పీ టి.సాయినాథ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పివికేఎన్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొబైల్ ద్వారానే 80శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జీవన్‌జ్యోతి మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతికను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు అవగాహన పెంచుకొని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. చిత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వన్ టౌన్ ఎం.మహేశ్వర్ మాట్లాడుతూ వివిధ సైబర్ నేరాల తీరును వివరిస్తూ వాటిపట్ల ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. ఫోన్లలో, ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలు అప్డేట్ చేయమని వచ్చే మెసేజ్లకు సందర్భించకూడదని తెలిపారు. చిత్తూరు ఇన్స్పెక్టర్ ఆఫ్ సిసి పి.ఉమామహేశ్వర్ సైబర్ మోసాలపై అప్రమత్తంగా వుండాలని వివరించారు.